కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో..టమాట 15, పచ్చిమిర్చి 50 , బెండ 50, కాకర 50, దొండ 50, దోస 40, ఆలు 30, చామ 50, కీర 30, బీర 60, వంకాయ 30, గోకర 60, బీన్స్ 70, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 30, చిక్కుడు 70, ఉల్లి 35(కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 20, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 180.

మదీనాగూడలో నిధి అగర్వాల్ సందడి



సిల్క్స్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న సినీనటి నిధి అగర్వాల్ తదితరులు

మియాపూర్: మదీనాగూడలో ఓ సిల్క్స్ ప్రారంభోత్సవంలో ప్రముఖ సినీనటి నిధి అగర్వాల్ సందడి చేశారు. సినీనటి దివి, పుష్ప–2 సినిమా ఫేమ్ కేశవ, దువ్వాడ శ్రీనివాస్, మాధురి, ప్రముఖ జ్యోతిష్యుడు వేణు స్వామితో కలిసి ఆమె స్టోర్‌ను ప్రారంభించారు. స్టోర్‌లో అన్ని రకాల శారీ కలెక్షన్లు చాలా బాగున్నాయని, తనకు అన్ని నచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బేబీ అక్క, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ కోర్టు కూల్చివేత



గచ్చిబౌలి: అక్రమ నిర్మాణం అంటూ జీహెచ్ఎంసీ అధికారులు ఓ ఫుడ్ కోర్టును కూల్చివేశారు. కొద్ది సంవత్సరాలుగా ఫుడ్ కోర్టు నిర్వహణ చేపడుతుండగా అనుమతి లేని నిర్మాణం అంటూ కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో శేరిలింగంపల్లి సర్కిల్ టైన్ ప్లానింగ్ అధికారులు శనివారం కూల్చివేశారు. గచ్చిబౌలి డీఎల్ఎఫ్ సమీపంలో ప్రధాన రహదారిని ఆనుకొని కొద్ది సంవత్సరాలుగా ఏఎం, పీఎం ఫుడ్ కోర్టును నిర్వహిస్తున్నారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఫుడ్ కోర్టును కూల్చివేశారు. ప్రైవేట్ వ్యక్తులు కోర్టును ఆశ్రయించడంతో కూల్చివేయాలని ఆదేశాలిచ్చిందని టౌన్‌ప్లానింగ్ అధికారులు తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న శరత్‌చంద్ర

బండ్లగూడ: పారిశుద్ధ్య పనులను నిర్వహించే విషయంలో కార్మికులు అలసత్వం వహించరాదని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. శనివారం ఉదయం 6 గంటలకు 13వ డివిజన్‌లోని పీరంచెరువు, 14వ డివిజన్‌లోని హర్షహైట్స్, 15వ డివిజన్‌లోని మాధవినగర్ కాలనీల్లోని పారిశుద్ధ పనులను ఆయన పరిశీలించారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ రాధాకృష్ణ నగర్‌లో తీవ్ర నీటి సమస్యతో అల్లాడుతున్నామని, తక్షణమే నీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కోరారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధ్యక్షుడు నాగుల సత్యం ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలో జలమండలి అధికారులతో సమావేశమై నియోజకవర్గంలో నీటి సమస్య ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసి శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ఏ. నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నరేందర్, ఉపాధ్యక్షులు కృష్ణ, సభ్యులు మల్లేష్, శ్రీరాములు, ఐజాక్, లాజరస్, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని (బొంతపల్లి) వీరన్నగూడెంలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయ హుండీని శనివారం లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈఓ శశిధర్ గుప్తా, ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో శివకేశవ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు లెక్కింపు చేపట్టారు. 91 రోజులకు సంబంధించి 13 లక్షల 83 వేల 135 రూపాయలు హుండీ ఆదాయంగా వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అన్నదానం హుండీకి సంబంధించి 57 వేల 447 రూపాయలు సమకూరిందన్నారు. ఈ లెక్కింపులో ఆలయ ధర్మకర్తలు గ్రామ పెద్దలు శివకేశవ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.





మియాపూర్ గురునాథం చెరువు కట్టపై నిరుపయోగంగా ఉన్న మూత్రశాలలు



ప్రశాంత్ నగర్ కాలనీ ప్రధాన రోడ్డులో..

లక్షలు వెచ్చించారు.. నిర్వహణ మరిచారు..

నిరుపయోగంగా పబ్లిక్ టాయిలెట్లు

- నీటి సౌకర్యం లేక దుర్వాసన
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

మియాపూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన పబ్లిక్ టాయిలెట్లు నిరుపయోగంగా మారాయి. సరైనా నిర్వహణ లేకపోవడంతో కంపుకొడుతున్నాయి. అందులోకి వెళ్లేందు కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మియాపూర్‌లోని ప్రధాన రహదారులలోని బస్టాప్‌ల వద్ద, ప్రధాన సర్కిల్‌లలో మూత్రశాలలను ఏర్పాటు చేశారు. నిర్వహణ లేమితో పలు ప్రాంతాల్లో మురుగుదొడ్లు, మూత్రశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మియాపూర్‌లో ఏర్పాటు చేసిన మూత్రశాలలకు నీటి సౌకర్యం లేకపోవడంతో అపరిశుభ్రంగా తయారై దుర్వాసన వెదజల్లుతున్నాయి. మరి కొన్ని చోట్ల మరుగుదొడ్లకు తలుపులు విరిగిపోయి దర్శనమిస్తున్నాయి. దీంతో పలువురు బహిరంగ మూత్ర విసర్జన చేస్తుండడంతో ప్రధాన రహదారుల వెంట దుర్వాసనతో వాహనదారులంతా ఇబ్బందులు పడుతున్నారు. ఏటా మూత్రశాలల నిర్వహణకు లక్షలాది రూపాయలు కేటాయిస్తున్నా ఆ నిధులు పక్కదారి పడుతున్నాయని తద్వార మూత్రశాలలు శుభ్రంగా ఉండడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మూత్రశాలల్లో శుభ్రత, సబ్బులు, శానిటైజర్ తదితర సదుపాయాలు కల్పిస్తామని చెప్పి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఆ దిశగా సౌకర్యాలు కల్పించడం లేదు. స్థానిక సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో మురుగుదొడ్లు, మూత్రశాలలు నిరుపయోగంగా మారాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మూత్రశాలలను శుభ్రం చేసి, నీటి సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



దీప్తి శ్రీనగర్ కాలనీ నుంచి పీజేఆర్ ఎంక్లేవ్ రోడ్డులో..



దీప్తి శ్రీనగర్ కాలనీలోని రెగుల కుంట వద్ద..

హఫీజ్‌పేట్ పీహెచ్‌సీలో మెగా వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

చందానగర్: హఫీజ్‌పేట్ పీహెచ్‌సీలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థకు చెందిన సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ మంజుల మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని నేపథ్యంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్యంపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. హెచ్ఐవీ యాక్టు 2017 గురించి ఎయిడ్స్‌పై, హెపటైటిస్ బీ, సీ గురించి తెలియజేయడం జరిగిందన్నారు. ఈ మెగా క్యాంపులో 135 మందికి పరీక్షలు చేయడం జరిగిందని వైద్యులు తెలిపారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ దివ్య, ల్యాబ్ అసిస్టెంట్ పండరి, పద్మ, ఫార్మసీ మమత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ పరిరక్షణ పోరుబాటలో పాట హల్‌చల్



అంజి రాసిన పాట ఆలపిస్తున్న విద్యార్థి బృందం

రాయదుర్గం: హెచ్‌సీయూలో భూపరిరక్షణ పోరుబాటలో పోరుపాట కలిసి నడుస్తోంది. విద్యార్థుల ఉద్యమానికి ఊపిరిలూదుతోంది. హెచ్‌సీయూ క్యాంపస్‌లోని భూమిని టీజీఐఐసీ ద్వారా వేలం వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో బహుజన స్టూడెంట్స్ ఫ్రంట్ (బీఎస్ఎఫ్) విద్యార్థి సంఘం పాట ద్వారా పోరాటం చేయాలని శనివారం నిర్ణయించింది. అందుకు మొదటగా 'బండెనుక బండి కట్టి పదహారు బండ్లు కట్టి'పాట తరహాలోనే తనదైన శైలిలో బీఎస్ఎఫ్ విద్యార్థి సంఘం హెచ్‌సీయూ అధ్యక్షుడు ఆరోళ్ల అంజి తనదైన శైలిలో ఓ పాటను రాశారు. 'భూమి మీద భూమి గుంజి... ఎన్నెన్నో భూములు గుంజి...... కేసీఆర్‌ను మించినావురో కాంగిరేసు రేవంత్‌రెడ్డి'అంటూ గీతాన్ని విద్యార్థులు ఆలపిస్తూ, డప్పు కొడుతూ ఆకట్టుకున్నారు. సోమవారం ఈ పాటతోపాటు మరిన్ని పాటలను ఆలపిస్తూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అంజి స్పష్టం చేశారు. హెచ్‌సీయూ ప్రహరీ లోపలి భూములను లాక్కోనిచ్చే ప్రసక్తే లేదని అన్నారు. కార్యక్రమంలో పలువురు బీఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

బీపీ మాత్రల్లేవు.. బయట తెచ్చుకోండి




ఫార్మాసిస్ట్ వెంకటరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి

- ప్రభుత్వాస్పత్రిలో రోగులకు సూచిస్తున్న ఫార్మాసిస్ట్
- అతడి నిర్వాకంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆస్పత్రి సూపరింటెండెంట్

పటాన్‌చెరుటౌన్: ప్రభుత్వాస్పత్రిలో టెల్ మా–40 బీపీ మాత్రల్లేవని, బయట నుంచి తెచ్చుకోవాలని గత మూడురోజులుగా వస్తున్న రోగులకు ఆస్పత్రి ఫార్మాసిస్ట్ వెంకటరెడ్డి చెబుతున్నారు. ఈ విషయాన్ని శనివారం చాలామంది రోగులు 'సాక్షి'దృష్టి తీసుకురాగా వెంటనే ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరింది. ప్రస్తుతం టెల్ మా–40 బీపీ మాత్రల కొరత ఉందని, బీపీకి సంబంధించిన ఇతర కాంబినేషన్ ట్యాబ్‌లెట్స్ మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రోగులకు బీపీ మాత్రలు లేవని బయట తెచ్చుకోవాలని పంపుతున్న ఫార్మాసిస్ట్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీపీ మాత్రల విషయంపై రోగులతో మాట్లాడగా...టెల్ మా–40 మాత్రలు ముందునుంచి వాడుతున్నామని, ఇతర కాంబినేషన్ (టెల్ మా–40తోపాటు అమోలడిఫిన్) మాత్రలు వేసుకుంటే ఇబ్బంది అవుతోందని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బీపీ మాత్రలు అందుబాటులోకి తీసుకురావాలని ఆస్పత్రికి వచ్చే రోగులు కోరుతున్నారు.

హైకోర్టు తీర్పు హర్షణీయం



మణికొండ: సంవత్సరాల తరబడి నివాసాలకు పక్కనే ఉన్న రెడీమిక్స్ ప్లాంట్‌ను తొలగించాలని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పుతో తమ బాధలు తొలగిపోతాయని నివాసితులు గౌతమ్‌రెడ్డి, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రావు, జైపాల్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మైహోం అవతార్, హాల్‌మార్క్ విసినియా వాసులు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. తమ నివాసాలకు ఎదురుగా వాసవి అట్లాంట వారి రెడీమిక్స్ కొనసాగుతుందని, దానిని తొలగించి తమ ఆరోగ్యాలను పరిరక్షించాలని మున్సిపల్, పోలీసులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రెవెన్యూ అధికారులతో మొర పెట్టుకున్న పట్టించుకోలేదన్నారు. చివరకు కోర్టును ఆశ్రయించటంతో వెంటనే మూసి వేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. నివాసితులు సాయి, ఆదినారాయణ, కవిత, రాధిక, నందన, మనోహర్, నిరంజన్, శ్రీకాంత్, సుబ్బారెడ్డి, నారాయణ, శ్రీధర్, రవి, సమిత్, బీఆర్ఎస్ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారాం, నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కుష్టు నిర్మూలన కార్యక్రమాలు

రాజేంద్రనగర్: ఈ నెల 17వ తేదీ నుంచి 30వ వరకు జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు అన్నారు. శివరాంపల్లిలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆశ కార్యకర్తలు ఉదయం 9 గంటల్లోపు ప్రతి ఇంటికి వెళ్లి లెప్రసీ వ్యాధి లక్షణాల కోసం పరీక్షలు చేసి అనుమానం ఉన్న వారిని దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేసికార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఉప వైద్యధికారి డాక్టర్ పాపారావు వ్యాధి వ్యాప్తి చెందే విధానం, లక్షణాలు, చికిత్స గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. జిల్లా పారా మెడికల్ అధికారి సులోచన సర్వే చేసే విధానం, రిపోర్టులు, తయారు చేసే పద్ధతిని వివరించారు.

విద్యుత్ స్తంభాలకు ప్రైవేటు కేబుళ్లు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విద్యుత్ స్తంభాలకు ఇష్టానుసారంగా కేబుల్ వైర్లను చుట్టుతున్నారు. ఏ స్తంభానికి చూసిన కట్టలు కట్టలుగా దర్శనమిస్తున్నాయి. ఈ కేబుళ్ల కారణంగా అప్పుడప్పుడు విద్యుదాఘాతం సంభవిస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుళ్లను తొలగించాలని పలుమార్లు సంబంధిత అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఉన్నతాధికారులు స్పందించి కేబుల్ వైర్లను తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

హెచ్‌సీయూలో జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు

రాయదుర్గం: హెచ్‌సీయూలో భూముల పరిరక్షణ కోసం పోరాటం చేయడానికి జాయింట్ యాక్షన్ కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. హెచ్‌సీయూలోని స్టూడెంట్స్ యూనియన్, టీచర్స్ అసోసియేషన్, వర్కర్స్ యూనియన్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ యూనియన్ సమష్టి పోరాటం చేయడానికి జేఏసీని ఏర్పాటు చేసుకున్నట్లు శనివారం ప్రకటించారు. అన్ని రకాలుగా పోరాటాలు చేసి, వినతి పత్రాలు సమర్పించి ఎట్టి పరిస్థితుల్లో భూములను పరిరక్షించాలని ఆయా యూనియన్ల నాయకులు నిర్ణయించారు. ఆయా యూనియన్ల ప్రతినిధులు ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించి తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వెంటనే వేలం పాటను నిలిపివేసి హెచ్‌సీయూ భూములను పరిరక్షించే వరకు అన్ని రకాలుగా పోరాటం చేయాలని సమష్టి సమావేశంలో నిర్ణయించారు.

పూర్వ విద్యార్థులకు అపూర్వ అవకాశం



లెక్చరర్లుగా నియామకమైన వారితో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తేజ్ లోహిత్‌రెడ్డి

రాయదుర్గం: రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) పూర్వ విద్యార్థులకు అపూర్వ అవకాశం లభించింది. రాయదుర్గంలోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీలో లెక్చరర్లుగా ముగ్గురికి అవకాశం లభించింది. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా వీరికి అవకాశం వచ్చింది. ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్‌లో బి.డీఈఎస్ ఫుట్‌వేర్ డిజైన్ కోర్సును 2018–22 బ్యాచ్‌లో పూర్తి చేసిన ముగ్గురు విద్యార్థులకు లెక్చరర్లుగా పనిచేసేందుకు అవకాశం లభించింది. పూర్వ విద్యార్థులు ప్రశాంత్, చంద్రశేఖర్, సూర్యతేజకు టీజీపీఎస్సీ ద్వారా ఈ అవకాశం లభించడం విశేషం. వారు ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ నర్సింహులుగారి తేజ్‌లోహిత్ రెడ్డిని శనివవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆ ముగ్గురిని అభినందించారు. చిన్న వయస్సులోనే మంచి అవకాశం వచ్చిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నృత్య శోభితం



శిల్పారామంలో అలరించిన భరత నాట్యం



మాదాపూర్: కళాకారులు భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం కళాకారులు అశ్విని, హర్షితారెడ్డి, ఐక్యతవర్మ, సాయిరామ్ భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో పుష్పాంజలి, వినాయకకౌతం, నటేశకౌతం, బ్రహ్మాసంది కౌత్వం, హంసనందిని జతిస్వరం, పరిపాహి, శ్రీచాముండేశ్వరీ కృతి, పదం, శృంగారలహరి, సురిటి తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమాస్వార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం అన్నమయ్యకీర్తనలకు అనుగుణంగా కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను కళాకారులు అలరించారు. కరువది సాయిశ్రావ్య శిష్యబృందం తన్వికసిరి, లాస్య, పర్ణిక, కీర్తి, మనస్వి, తాన్విశ్రీ, తదితరులు పాల్గొని బహ్మమొక్కడే, శ్రీమన్నారాయణ, మధురాష్టకం, అష్టపది, ఇట్టి ముద్దులాడే బాలుడు, అదిగో అల్లదిగో, జగడపు చనువుల, అష్టపదిస్తోత్రం తదితర అంశాలను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. అనంతరం కళాకారులను జ్ఞాపికలతో సంస్థ నిర్వాహకులు సత్కరించారు.



అన్నమయ్యపురంలో కూచిపూడి నృత్యప్రదర్శన

ప్రభుత్వ స్థలంలో డంపింగ్



ప్రభుత్వ భూమిలో వేసిన వ్యర్థాలు

మణికొండ: ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా ఓ నిర్మాణ సంస్థ డంపింగ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదని కోకాపేటవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట రెవెన్యూ సర్వే నెంబర్ 144లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దాని పక్కనే ఓ నిర్మాణ సంస్థ తమ కార్యకలాపాలను కొనసాగిస్తుంది. బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్‌ను ప్రభుత్వ భూమిలోకి పడేయటంతో పక్కనున్న నివాసాల్లో దుమ్ము చేరుతుంది. దాంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇదే విషయాన్ని అటు నిర్మాణ సంస్థ, ఇటు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు ప్రభుత్వ భూమిలో డంపింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని, లేకుంటే జిల్లా కలెక్టర్, హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఏఐ వినియోగంతో బోధన సులువు

కలెక్టర్ వల్లూరు క్రాంతి



ఏఐ ఆధారిత బోధన అభ్యాసన ప్రక్రియను విద్యార్థులతో కలసి ప్రారంభిస్తున్న కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు టౌన్: అభ్యాసన ప్రక్రియలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగంతో బోధన సులువవుతుందని విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడతాయని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి ముత్తంగిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఏఐ ఆధారిత బోధన, అభ్యాసన ప్రక్రియను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ... బోధన, అభ్యాసన ప్రక్రియలో నూతన పద్ధతుల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ముత్తంగి ప్రాథమిక పాఠశాలతోపాటు జిల్లాలో 33 పాఠశాలల్లో ఏఐ ఆధారిత బోధనను ప్రారంభించామన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు అందరితో సమానంగా చదువుకునే సామర్థ్యాన్ని అందించేవిధంగా ఈ కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ పథకం అమలు చేయనున్న జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఇప్పటికే ఇంటర్నెట్ సౌకర్యం అందించామని వెల్లడించారు. తల్లిదండ్రులను పూర్తిస్థాయిలో పాఠశాల, విద్యార్థుల అభివృద్ధిలో భాగస్వాములయ్యేలా చూడాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అందజేస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత యూనిఫారం, మధ్యాహ్న భోజనం, కంప్యూటర్ విద్య, ఇంటరాక్టివ్ ప్లాంట్ ప్యానెల్స్ ద్వారా విద్య, బాలికలకు ఆత్మరక్షణకు కరాటే, పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం పూట స్నాక్స్ అందజేయడం తదితర సౌకర్యాలు గురించి విద్యార్థులు, తల్లిదండ్రులకు కలెక్టర్ వివరించారు. ప్రభుత్వం కల్పిస్తోన్న సౌకర్యాలను వినియోగించుకుని తమ పిల్లలు మరింత ఉన్నతస్థాయికి ఎదిగేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, అకడమిక్ మానిటరింగ్ అధికారి అనురాధ, సీఎంవో కె.వెంకటేశం, మండల విద్యాధికారి నాగేశ్వర్‌నాయక్, పాఠశాల హెచ్ఎం శారద, ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షుడు, సభ్యులు ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్‌లో నిర్మిస్తోన్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ క్రాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...స్వయం సహాయక సంఘాల ద్వారా శిక్షణ పొందిన మహిళా మేస్త్రీలు ఇండ్ల నిర్మాణంలో భాగస్వాములయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన సిమెంట్ ఇటుకలను నిర్మాణంలో వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ, పీడీ చలపతిరావు, తహసీల్దార్ రంగారావు, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల కేంద్రం తనిఖీ

పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ క్రాంతి సందర్శించారు. అనంతరం కలెక్టర్ పాఠశాలల్లోని మహాత్మా జ్యోతి బాపూలే బాలికల గురుకుల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో కిచెన్ షెడ్డును, డైనింగ్ హాల్‌ను, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రంగారావు, మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు సంబంధిత అధికారులు ఉన్నారు.